భక్తిశ్రద్ధలతో అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ


అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


ప్రతిష్ఠించిన అంకమ్మ తల్లి విగ్రహం

● పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

మోటుమాల (కొత్తపట్నం): మండలంలోని మోటుమాల గ్రామంలో అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 3న ప్రారంభమైన అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా చివరిరోజు నిర్వహించిన పూజా కార్యక్రమాలలో ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంకమ్మ తల్లి విగ్రహం ముందు పూజలు చేసి టెంకాయలు కొట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, పాందూరు ఆలయ సిద్దాంతి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ, కలశ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కుంకుమార్చన, అన్నసంతర్పణ నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయం చుట్టూ తిరిగి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతిష్ఠ అనంతరం భారీగా అన్నదానం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, సర్పంచ్ కోడూరి గోపి, పురిణి కృష్ణారెడ్డి, పురిణి బ్రహ్మారెడ్డి, పాలచంద్ర, సిద్దయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాదర్తి సురేష్, యానాది, పాదర్తి కల్పన తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న దుంపా చెంచిరెడ్డి

క్రికెట్ విజేతలకు బహుమతుల పంపిణీ

చీమకుర్తి: ప్రకాశం ప్రీమియర్ క్రికెట్ విజేతలకు వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం బహుమతులు అందించారు. గత నెల 22 నుంచి శుక్రవారం వరకు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఒంగోలు సిరి హాస్పిటల్ క్రికెట్ క్లబ్ వారు ప్రథమ బహుమతి సాధించి రూ.50 వేలు, ఒంగోలు హెచ్ఎంసీసీ జట్టు ద్వితీయ బహుమతి సాధించి రూ.30 వేలు కైవసం చేసుకున్నారు. స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుంపా ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో సంతనూతలపాడు ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీలో ఈ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి, తహసీల్దార్ శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


ఈతముక్కలలో అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు


కొత్తపట్నంలో ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న భక్తులు

ఈతముక్కల (కొత్తపట్నం): మండలంలోని ఈతముక్కల గ్రామంలో మార్కండేయ వీవర్స్ కాలనీలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈతముక్కల గ్రామ వాస్తవ్యుడు జంగిలి రామాంజనేయులు, షాలిని దంపతులు ఈ నెల 3వ తేదీ నుంచి నిర్వహించిన ప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. గ్రామ పెద్దలు, అర్చకులు, ఉదయగిరి వెంకటాచార్యులు, యాజ్ఞికస్వామి పరాంకుశం రాథేసాయి, ఉదయగిరి శేషసాయి ఆధ్వర్యంలో చివరిరోజు చతుర్వేదపారాయణం, విష్వక్సేన పూజ, అగ్నిధాన్యం, కుంభారాధన, రత్నన్యాసం, యంత్రస్థాపన పూజలు చేశారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠను ఎంతో వైభవంగా జరిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయం చుట్టూ తిరిగి మొక్కులు చెల్లించుకున్నారు. పురోహితుల పర్యవేక్షణలో అర్చకుల బృందం వేదమంత్రాలతో పూజలు చేశారు. అభయాంజనేయస్వామి దర్శనం చేసుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కొత్తపట్నంలో ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ...

కొత్తపట్నం రెడ్డిపాలెంలో నాంచారమ్మతల్లి ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో ఆంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం భూమి పూజ చేశారు. నాంచారమ్మతల్లి కమిటీ సభ్యులు గ్రామ పెద్దల సహకారంతో వేదమంత్రాలతో పూజలు చేశారు. ఆంజనేయస్వామి చిత్రపటాన్ని రెడ్డిపాలెం నుంచి ఊరేగింపుగా శంకుస్థాపనకు సిద్ధంగా ఉంచిన స్థలం వద్దకు తీసుకొచ్చారు. పురోహితుడు పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు టెంకాయలు కొట్టగా, మహిళలు బిందెలతో నీరు పోశారు. కార్యక్రమంలో ఆలయ కాపు గౌరవరపు కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలినేని


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: స్థానిక పాత గుంటూరు రోడ్డులో రవిప్రియ మాల్ ఎదురుగా ఉన్న గ్రౌండులో ఏర్పాటు చేసిన అనిత ట్రేడ్ ఫెయిర్ వారి దుబాయ్ సిటీ ఎగ్జిబిషన్‌ను స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. సెట్టింగ్ బాగుందని, వేసవి సెలవుల్లో ప్రజలకు ఉల్లాసాన్ని కలిగిస్తుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, నిర్వాహకులు యాదాల రాజశేఖర్, వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి హాజరైన బాలినేని...


గృహ ప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు వన్‌టౌన్ స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ నర్రా వెంకటరెడ్డి నూతన గృహ ప్రవేశానికి శుక్రవారం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. సత్యన్నారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న అనంతరం వెంకటరెడ్డి దంపతులను అభినందించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభ ఏర్పాటుకు జెండా ఆవిష్కరణ


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చీమకుర్తి: మండలంలోని కూనంనేనివారిపాలెంలో ఈ నెల 14వ తేదీ ప్రసన్నాంజనేయస్వామి 22వ వార్షికోత్సవ తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ తరఫున నిర్మించనున్న విద్యుత్ ప్రభకు ముందస్తుగా పార్టీ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

చీమకుర్తి: ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి తల్లి చిన్నమ్మ వర్ధంతి సందర్భంగా శుక్రవారం చీమకుర్తిలో వెయ్యి మంది పేదలకు డాక్టర్ బీ జవహర్, మారం వెంకారెడ్డి చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత చిన్నమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్పొరేషన్ బ్యాంక్ సమీపంలో మారం వెంకారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, పోకూరి రామకృష్ణారెడ్డి, మల్లినేని వెంకటేశ్వర్లు, పేరం శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

11న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

మద్దిపాడు: ఐసీడీఎస్ మద్దిపాడు ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఈ నెల 11వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీవో ఇవాంజిలిన్ తెలిపారు. రెండు అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు 5 అప్లికేషన్లు, 20 హెల్పర్ పోస్టులకు 41 అప్లికేషన్లు, ఒక మినీ అంగన్‌వాడీ పోస్టుకు 6 అప్లికేషన్లు వచ్చినట్లు వెల్లడించారు. అర్హత పొందిన దరఖాస్తుదారులు ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు ఒంగోలులోని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాలులో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సీడీపీవో సూచించారు.

ఘనంగా బాల సంస్కార కేంద్రాల వార్షికోత్సవం


వేడుకల్లో పాల్గొన్న కేంద్రాల నిర్వాహకులు, విద్యార్థులు

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): ఒంగోలులోని శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీవాణి విద్యానికేతన్ ఆధ్వర్యంలో కె.పల్లెపాలెంలో నిర్వహిస్తున్న శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాల 2022–23 విద్యా సంవత్సర వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీవాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ చాపల కోటేశ్వరరావు, శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు చాపల వంశీకృష్ణ, శాంతకుమారి పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పల్లెపాలెంలోని మూడు ప్రభుత్వ పాఠశాలలకు అనుబంధంగా మూడు శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాలు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. నాలుగో తరగతి విద్యార్థి సైకం వరుణ్‌శంకర్‌కు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాల సంస్కార కేంద్రాల సూపర్‌వైజర్ లక్ష్మణ్, టీచర్లు సంధ్య, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటూరు వెళ్లి పింఛన్ అందించిన వలంటీర్


సుబ్బలమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ బీబీజాన్

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): మండలంలోని కె.పల్లెపాలెం పంచాయతీకి చెందిన పిన్ని సుబ్బలమ్మ అనారోగ్యంతో గుంటూరు ఎన్ఆర్ఐ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక వలంటీర్ పెదసింగు బీబీజాన్ శుక్రవారం గుంటూరు ఎన్ఆర్ఐ హాస్పిటల్‌కు వెళ్లి సుబ్బలమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేశారు. వలంటీర్‌ను గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది అభినందించారు.